క్లుప్తంగా

128 రోజులకు చేరిన దీక్షలు



దీక్షలో అఖిలపక్షం నాయకులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 128 రోజులకు చేరుకున్నాయి. నెలల తరబడి దీక్షలు కొనసాగుతున్నా.. అధికార పార్టీకి కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు. అఖిలపక్షం ప్రతినిధులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నిధులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పంచాయతీ పరిధిలోని శేరిల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం రామాయంపేట క్లస్టర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప సందర్శించారు. ఈ క్రమంలో భవనం పైకప్పు పెచ్చులు అక్కడక్కడ ఊడిపోవడం గమనించారు. చిన్నారుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని భవనం మేజర్ మరమ్మతులు చేపట్టడానికి గాను తన కార్యాలయం నుంచి రూ. 2లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. సూపర్‌వైజర్ వెంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేశం, అంగన్‌వాడీ టీచర్ దేవలత ఉన్నారు.

మద్యం బాటిళ్ల తొలగింపు



పాఠశాలలో తొలగించిన మద్యం బాటిళ్లు

సాక్షి ఎఫెక్ట్

టేక్మాల్(మెదక్): గత నెల 31న సాక్షి దినపత్రికలో పాఠశాల ఆవరణలో మద్యం బాటిళ్లు అనే కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. పాఠశాల ఆవరణలో ఉన్న మద్యం బాటిళ్లను, పిచ్చిమొక్కలను శుభ్రం చేయించారు. ఈ విషయమై టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో పాఠశాలలో అపరిశుభ్రం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అదే విధంగా ఎంఎంబీలో గ్రామ పంచాయతీ తరఫున మంజూరైన పాఠశాల ప్రహరీ నిర్మాణం వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

జీవో 46 ప్రకారమే పోస్టులు కేటాయించాలి

మెదక్: టీఎస్‌ఎస్‌పీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి అందరికి ప్రభుత్వం జీవో 46 కేటాయించిందని దాని ప్రకారమే కేటాయింపులు జరగాలని నిరుద్యోగ యువత డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్‌లో పలువురు నిరుద్యోగ యువత నిరసన వ్యక్తం చేశారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన

పెద్దశంకరంపేట(మెదక్): కుటుంబ నియంత్రణకు సంబంధించి అవగాహన ప్రతీ ఒక్కరూ కలిగి ఉండాలని వైద్యురాలు శ్రీవిద్య అన్నారు. ఈ విషయం పై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆమె మంగళవారం తెలిపారు. దీనిలో భాగంగానే రీజినల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ట్రైనింగ్ సెంటర్ నిర్వాహకుల నుంచి ట్రైనింగ్ సర్టిఫికెట్ అందుకున్నట్లు చెప్పారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

నర్సాపూర్‌రూరల్: మండల వ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సామ్యా నాయక్, రాష్ట్ర కార్యదర్శి వీరేశం సార్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు లాలునాయక్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

ఫామ్‌హౌస్‌లో చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వ్యక్తులు ఫామ్‌హౌస్‌లో చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని తాళ్లపల్లి పంచాయతీ పరిధిలో చోటు చేసుకుంది. శివ్వంపేట – కొత్తపేట ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రవీణ్‌రావు ఫామ్‌హౌస్‌లో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి బోరు మోటార్‌తో పాటు పైపులు పలు వస్తువులు చోరీ చేస్తున్న దొంగలను గుర్తించిన ఫామ్‌హౌస్ వాచ్‌మెన్ యాదయ్య ఈ విషయం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టారు.

ఫాగ్ మిషన్‌లో మంటలు

నర్సాపూర్ రూరల్: పట్టణంలో మున్సిపాలిటీ సిబ్బంది చెత్త సేకరణ వాహనంలో ఫాగ్ మిషన్ పెట్టు కొని వీధుల్లో దోమల నివారణ కోసం స్ప్రే చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దీంతో చెత్త వాహనంలో అడుగు భాగంలో ఉన్న చెత్తకు నిప్పు అంటుకున్నాయి. వెంటనే మున్సిపల్ సిబ్బంది స్పందించి మంటలు ఆర్పేయడంతో ప్రమాదం తప్పింది.

ప్రమాదకరం.. రహదారి ప్రయాణం

రామాయంపేట(మెదక్): జిల్లాలోని జాతీయ రహదారి–44 పై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై ఎక్కడికక్కడ గుంతలు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో తూప్రాన్ మండలం కాళ్లకల్ నుంచి రామాయంపేట మండలం దామరచెరువు వరకు 55 కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ రోడ్డుపై సుమారు 80 చోట్ల తారు లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. నిర్వహణ బాధ్యతను చేపట్టే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. భారీ వర్షాలకు రామాయంపేట, జప్తిశివునూర్ వద్ద రోడ్డు పైనుంచి వరద నీరు ప్రవహించి పలు చోట్ల రోడ్డు పాడైంది. ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



జప్తిశివునూర్ క్రాసింగ్ వద్ద ఇలా..



రామాయంపేట వద్ద ఇలా..

మరమ్మతు చేస్తాం

జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతు చేస్తున్నాం. ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ రోడ్డు దెబ్బతిన్నది. వారంలో పనులు ప్రారంభించి గుంతలు పూడ్చివేయిస్తాం.

– శ్రీనివాసరావు, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

నర్సాపూర్: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని క్యాబినేట్‌లో నిర్ణయం తీసుకున్నందుకు మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఆర్టీసీ ఉద్యోగులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, గ్యారేజ్ ఇన్‌చార్జ్ శ్యాంసుందర్, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ నరేందర్, సిస్టం ఇన్‌చార్జ్ వెంకట్‌గౌడ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

మెదక్: సీఎం కేసీఆర్ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన వారిలో డిపో మేనేజర్ సుధా, తిరుమలేశ్, సుధాకర్, శాకయ్య, మొగులయ్య, నాగరాజు, సత్యనారాయణ, శేఖర్ , జాకీర్ పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని దేశాయ్, ఠాకూర్, చారుబాయ్ బీడీ కంపెనీల టేకేదారుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నూతన బస్టాండ్ సమీపంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టేకేదారులు శ్రీశైలం, ఎల్.రాములు గౌడ్, శంకరయ్య, తిరుపతి, కైరంకొండ నారాయణ, అమర్, భిక్షపతి, లక్ష్మీనారాయణ భాస్కర్, ధనుంజయ, నరేందర్ రెడ్డి, సత్యనారాయణ, ఉపసర్పంచ్ బాబు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



నర్సాపూర్ డిపో ఆవరణలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

నర్సాపూర్: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణానికి చెంది మహ్మద్ నజీర్, బీపాషాలకు చెందిన ఇళ్లు కూలాయి. దీంతో వారిని మంగళవారం రాజిరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట పార్టీ నాయకులు శ్రీశైలం యాదవ్, శ్రీపతి, రాధాకిషన్, దుర్గేశ్, మల్లేశ్, ధన్‌సింగ్ తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకుడు రాజిరెడ్డి

చేపల పెంపకానికి చెరువుల వేలం

కౌడిపల్లి(నర్సాపూర్): చెరువు కుంటల్లో జలకళ సంతరించుకుంది. దీంతో మండల కేంద్రంలోని ముదిరాజ్ భవనంలో పెద్దచెరువుతో పాటు కుంటలను చేపల పెంపకానికి మంగళవారం ముదిరాజ్ సంఘం, మత్స్యసహకారం సంఘం ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. రెండేళ్ల కాల పరిమితితో వేలం వేశారు. కౌడిపల్లి పెద్ద చెరువును రూ. 2లక్షల 5వేలకు గ్రామానికి చెందిన భుజిరంపేట దుర్గేశ్ దక్కించుకున్నారు. దీంతో పాటు పల్లె చెరువు రూ. 75వేలకు బర్ల శంకరయ్య, రెడ్లకుంట రూ. 68వేలకు రెడ్డి రమేశ్, వెంకన్నగారికుంట రూ. 46వేలు ఇట్టబోయిన విఠల్, ఎలుకచెరువు రూ. 17వేలకు బర్ల కృష్ణ, మల్లుకుంట రూ. 10వేలకు పెద్ద శాఖయ్య వేలంలో దక్కించుకున్నారు. వేలంలో వచ్చిన డబ్బులు పెద్దమ్మదేవి ఆలయం నిర్మాణం కోసం ఖర్చుచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శాఖ్య, గ్రామ సంఘం అధ్యక్షుడు మల్లేశం, మత్స్యకారులు సంఘం అధ్యక్షుడు విఠల్, నాయకులు లక్ష్మణ్, పాండు, బాలింగం, కృష్ణ, శాఖయ్య, సురేశ్, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న గ్రామస్తులు

'ఎంపీపై అనర్హత వేటు వేయాలి'

రామాయంపేట(మెదక్): ఎస్సీ జాబితా నుంచి బంజారాలను తొలగించాలని ఎంపీ సోయం బాబూరావు డిమాండ్ చేయడం సిగ్గుచేటని తెలంగాణ బంజారా ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు విఠల్ నాయక్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఉమ్లానాయక్, డివిజన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం రామాయంపేటలో జరిగిన సంఘంలో పాల్గొన్న వారు విలేకరులతో మాట్లాడుతూ.. కనీస పరిజ్ఞానంలేని ఎంపీపై అనర్హత వేటు వేయాలన్నారు. రాజ్యాంగ బద్ధంగా ప్రత్యేక భాష, గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను అనుసరించి ఎస్టీ జాబితాలో చేర్చారని చెప్పారు. ఎంపీ బాబూరావు, తన స్వార్థం కోసం తెగల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్నారని, ఈ విషయమై బీజేపీ అధిష్టాన వర్గం ఆయనపై చర్యలు తీసుకొని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రామాయంపేట మండలాధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

దోపిడీని అరికట్టాలి

మెదక్ కలెక్టరేట్: కార్పొరేట్ సెలూన్ ద్వారా నాయీ బ్రాహ్మణ క్షౌ ర వృత్తి దోపిడీని అరికట్టాలని కోరుతూ నాయీ బ్రాహ్మణ సంఘం ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామి, గౌరవ అధ్యక్షుడు రమేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్, సత్యనారాయణ, సలహాదారులు అడివయ్య, రమేశ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో మంగళవారం విశేష పూజలు చేశారు. వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో పురుషోత్తమ మాసంలో వచ్చే పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, మహామంత్రహవనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బగలాముఖీని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ట్రస్ట్ సభ్యుడు శివకుమార్‌గౌడ్ భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ గురు పీఠంకు భూమి విరాళం

మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో శ్రీ గురు పీఠం నిర్మించేందుకు హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ ముందుకొచ్చారు. అందులో భాగంగా శ్రీ గురు పీఠం నిర్మాణానికి 16 గుంటల భూమిని మంగళవారం బగలాముఖీ ఆలయం వద్ద భూదాన పత్రాలు అందజేశారు.



హోమం నిర్వహిస్తున్న పండితులు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని కన్యకపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక శ్రావణమాసం సందర్భంగా మహిళలు 33 రకాల పూవ్వులతో అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులోని దత్తాత్రేయ దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తండాలను పంచాయతీలుగా చేయాలి

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలో రెండు తండాలను కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని మంగళవారం ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌కు మండల బీఆర్‌ఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. మండలంలోని షాబాద్‌తండా గ్రామ పంచాయతీ నుంచి నల్లకుంట తండాను, మండలంలోని అసన్‌మహ్మద్‌పల్లి పంచాయతీ నుంచి లాలు తండాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరామని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వీరప్ప తెలిపారు.



ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అధిక యూరియా వాడొద్దు

హవేళీఘనపూర్: ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తున్న క్రమంలో రైతులు వరికి అధికంగా యూరియా వాడితే మోగిపురుగు సోకే ప్రమాదం ఉందని మండల వ్యవసాయ అధికారి నాగమాధురి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జక్కన్నపేట గ్రామంలోని వరిపంటల పొలాలను ఆమె పరిశీలించారు. ఏవో వెంట ఏఈఓ భార్గవ్, రైతులు ఉన్నారు.

మినీగురుకులం ప్రిన్సిపాల్‌గా జమునారాణి

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల మినీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా జమునారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన ప్రిన్సిపాల్ స్రవంతి కల్హేర్ బదిలీపై వెళ్లారు.

మండలానికి రాగిపిండి, బెల్లం ప్యాకెట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థుల అల్పాహారం కోసం రాగిపిండి, బెల్లం ప్యాకెట్లు మండలానికి వచ్చినట్లు ఎంఈఓ బుచ్చనాయక్, ఉపాధ్యాయులు తెలిపారు.

పాఠశాలల్లో కంటి పరీక్షలు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలోని ఎస్టీ గురుకుల పాఠశాల, మినీగురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం కంటి వైద్యులు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఓ రమేశ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల విద్యార్థినిలకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యురాలు జ్యోత్స్నదేవి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సీఎస్‌ఓలు బాల్‌నర్సయ్య, సల్లుబాయి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు కండ్ల కలక

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలలో ఏడు మంది విద్యార్థులకు కండ్ల కలక సోకినట్లు పాఠశాల హెచ్‌ఎం ఖాజా అలీ మంగళవారం తెలిపారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజీగూడెంలో అండర్ డ్రైనేజీ పనులను సర్పంచ్ వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలోఎంపీటీసీ శ్రీలత, ఉప సర్పంచ్ రేణుకుమార్, పీఆర్ ఏఈ మధు, నారాయణగౌడ్, నర్సయ్య, కార్యదర్శి నందిని, వార్డు సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటా

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన 11 మంది నిరుపేదలకు హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ ఒక్కొక్కరికి 3 వేల చొప్పున రూ. 33 వేల ఆర్థిక సహాయం చేశారు.

ముర్రుపాలే శిశువుకు మొదటి టీకా

చిలప్‌చెడ్(నర్సాపూర్): ముర్రుపాలే శిశువుకు మొదటి టీకా అని, బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. మంగళవారం ఆమె చిలప్‌చెడ్ అంగన్‌వాడీ కేంద్రం–2 లో తల్లిపాల ప్రాముఖ్యతను అవగాహన కల్పించారు. సర్పంచ్ లక్ష్మీరెడ్డి ,అంగన్‌వాడీ టీచర్ ప్రమీల పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోష తెలిపారు. శివ్వంపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలపై తల్లులకు అవగాహన కల్పించారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పించిన వారిలో వైద్యుడు జ్యోత్స్నదేవి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సక్కుబాయి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

తూప్రాన్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కల్పించిన వారిలో అంగన్‌వాడీ టీచర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సంతోషిమాత

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ముందస్తు జాగ్రత్తగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం వల్ల వాటికి వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పశువైద్యాధికారి వినోద్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్కుల్ గ్రామంలో ఆయన, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సుభాశ్‌రెడ్డిలతో కలిసి గాలికుంటు టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్, ఓఎస్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని శెట్టిపల్లికలాన్ గ్రామంలో పశువైద్య సిబ్బంది గోజాతి, గేదె జాతి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. వీఎల్‌ఓ ఫజలుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసిన వారిలో మండల పశువైద్యాధికారి రాజు, జేవీఓ కృష్ణకుమార్, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయండి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహ్మద్‌నగర్ పంచాయతీ పరిధిలోని కన్నారం గ్రామాన్ని గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని మంగళవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ ఉపసర్పంచ్ ఫారుక్, సొసైటీ డైరెక్టర్ రామయ్య, గ్రామస్తులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి కన్నారం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



నిజాంపేట(మెదక్): బచ్చురాజ్‌పల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

వెల్దుర్తి(తూప్రాన్): సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ అన్నారు. మాసాయిపేట మండలంలోని రామంతాపూర్ గ్రామంలో వరినాట్లు వేస్తున్న పంట పొలాలను ఆయన పరిశీలించారు.

నిజాంపేట(మెదక్): మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామంలో పలువురి రైతుల వరి పంటలను మండల వ్యవసాయ అధికారి సతీశ్ సందర్శించారు. ఈ మేరకు వరి పంటలో మోగి ఉధృతిని గమనించి, దాని నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటలో మోగి పురుగు నివారణకు నారు మళ్లల్లో ఎకరా నారుమడికి 800 గ్రాముల 3 జీ గుళికలు చల్లుకోవాలన్నారు. వరి నాటేప్పుడు వరి కొనలు తుంచి నాటుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కావేరి , రైతులు రాజలింగం, మల్లేశం, పర్శరాములు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్

కౌడిపల్లి(నర్సాపూర్): చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని టీపీసీసీ కార్యదర్శి రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని భుజిరంపేటలో 300 మంది పాఠశాల విద్యార్థులకు జామిట్రీ బాక్స్, పెన్స్, లాంగ్ స్కేల్ పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరావ్, జిల్లా సేవాదళ్ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

కదన భేరికి తరలిన విద్యార్థులు

నర్సాపూర్: ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన విద్యార్థి కదన భేరికి నర్సాపూర్ నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశికాంత్, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఓంకార్‌యాదవ్, ఏబీవీపీ నాయకులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పరామర్శ**

నిజాంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన పెద్ద పైడి తిరుమల్‌రెడ్డి ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. దీంతో మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తిరుమల్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, రూ. 5వేల ఆర్థికసాయాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

◆ **కట్టుకాలువ నిర్మించి ఆదుకోండి**

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలంలోని భీంరావుపల్లి శివారులోని సామలకుంట నుంచి దేవునిచెరువు వరకు కట్టుకాలువ నిర్మించాలని గ్రామ వార్డు మెంబర్ బోయిని భూషణం విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ రెండు కుంటల మధ్య తొమ్మిది వందల మీటర్ల మేర కాల్వ నిర్మిస్తే నీరు దేవుని చెరువులోకి చేరి రైతులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈవిషయమై పలుమార్లు మంత్రి హరీశ్‌రావు, అధికారులకు వినతిపత్రాలు అందజేసినా.. ఇంతవరకు మంజూరు రాలేదని వాపోయారు. అధికారులు స్పందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

◆ **రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి**

కౌడిపల్లి(నర్సాపూర్): ఇప్పటివరకు రైతుబీమా చేసుకోని రైతులు ఈనెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, ఆత్మ కమిటీ ఏటీఎం నరేందర్ తెలిపారు. మంగళవారం వ్యవసాయ కార్యాలయం వద్ద రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులు తీసుకున్నారు.

◆ **గేదెలను ఢీకొన్న లారీ**

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు దాటుతున్న గేదెలను లారీ ఢీ కొనడంతో అక్కడిక్కడే గేదెలు చనిపోయిన సంఘటన మనోహరాబాద్‌లో మంగళవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు మారేడుపల్లె లలితాకు చెందిన రెండు గేదెలు, లేగ దూడలు జాతీయరహదారిపై రోడ్డు దాటుతుండగా లారీ ఢీ కొన్న సంఘటనలో ఒక గేదె, లేగదూడలు చనిపోయాయి. ఇంకో గేదెకు కాళ్ళు విరిగిపోయాయి. దీంతో రైతుకు తీవ్రనష్టం వాటిల్లింది.

◆ **తూప్రాన్ ఎస్ఐగా శివానందం**

తూప్రాన్: తూప్రాన్ నూతన ఎస్‌గా శివానందం బాధ్యతలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన బదిలీపై తూప్రాన్‌కు వచ్చారు.

◆ **చేయూత**

చేగుంట(తూప్రాన్): మండలంలోని చందాయిపేట గ్రామంలో పూజారి అన్నపూర్ణమ్మ ఇంటి నిర్మాణానికి దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సిమెంట్ అందించినట్లు కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు నాగవేందర్‌రెడ్డి తెలిపారు.

◆ **ప్రశంస పత్రాల అందజేత**

తూప్రాన్: ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్, పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే లిమిటెడ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తూప్రాన్ వారి సహకారంతో టోల్‌ప్లాజా వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తందానం చేసిన వారికి ప్రశంస పత్రాలను ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ పంపిణీ చేశారు.

◆ **మండలానికి 22వేల నోట్‌బుక్స్**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలానికి 22,545 నోట్ పుస్తకాలు వచ్చినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ బుచ్యానాయక్, సీఆర్‌పీ అంజయ్య తెలిపారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

మెదక్ మున్సిపాలిటీ: పట్టణ పరిధిలోని ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీకి చెందిన హజర్ నవాబ్ తండ్రి అఫ్జల్ నవాబ్‌కు మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్ జయరాజ్, తదితరులు ఉన్నారు.

◆ **సన్మానం**

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం ఎస్ఐగా పని చేసిన సార శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం బదిలీపై కామారెడ్డి జిల్లా మాచరెడ్డికి వెళ్లారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనను సన్మానించారు.

◆ **క్రీడా సామగ్రి పంపిణీ**

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంలో ప్రభుత్వం అందజేసిన క్రీడా సామగ్రిని క్రీడాకారులకు ఎంపీపీ హరికృష్ణ అందజేశారు. ఎంపీడీఓ నవీన్‌కుమార్, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

◆ **నేటి నుంచి తొలిమెట్టుపై ఉపాధ్యాయులకు శిక్షణ**

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నుంచి ఆరు రోజుల పాటు తొలిమెట్టు కార్యక్రమంపై ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహిస్తారని ఇన్‌చార్జ్ ఎంఈఓ బుచ్యానాయక్ తెలిపారు.